దట్టమైన చీకటి ఆవరించుకుని వుందక్కడ.

“ఎందుకిదిలా అరుస్తోంది? అక్కడెవరూ వున్న జాడ కూడా లేదే” అనుకున్నాడతను.

“ఊర్కోడాలీ ..... ఊర్కో” సముదాయించాడతను. ఏమీ లాభం లేకపోయింది. ముందు కాళ్ళు పైకెత్తి నిటారుగా నిలబడి మరీ అరుస్తోంది.

ఇక దాన్ని నిలువరించటం సాధ్యంకాదని తెలుసుకుని బలవంతంగా దాన్ని ఈడ్చుకుంటూ తిరిగి లోపలికి వెళ్ళిపోయాడతను.

లోపలికెళ్ళాక కూడా కొద్దిసేపు అరిచి అతను గట్టిగా అదిలించేసరికి ‘గుర్ర్ ర్ర్’ మంటూ వుండిపోయింది.

“ఏమిటో పట్నం కుక్కలు ..... దొంగలని చూసి అరవవు. చెట్లు పుట్టల్నీ చూసి అరుస్తాయ్’ మనసులో అనుకున్నాడతను.

* * * * *

మరుసటి రోజు ఉదయం వచ్చేసింది మనస్విని. ఆమె చేతిలోని బ్యాగునిండా ఏపిల్స్, బ్రెడ్, జామ్ వంటి సరంజామా వుంది.

“ఇక్కడికి పెద్ద ఎత్తునే వచ్చావే” అన్నాడు మహదేవ్. అప్పటికే అక్కడున్న అభిరాం, వరప్రసాదం పెద్దగా నవ్వేశారు. ఏపిల్ కోసి అందరికీ అందించిందామె. తరువాత బ్రెడ్‌పై జామ్ పూసి తలాఒక్కటి పంచుతూ వుండిపోయింది మనస్విని.

మధ్యాహ్నం అభిరాం, వరప్రసాదం ఇంటికెళ్ళి భోజనం చేసేసి ఓ కారియర్‌లో అభిరాంకీ, మనస్వినికీ తెచ్చారు. కాస్సేపు కూర్చుని ఇద్దరూ పనుందని వారికి ఏకాంతం కల్పిస్తూ జారుకున్నారు.

మహదేవ్, మనస్వినిలు కబుర్ల కడలిలో తేలిపోయారు. ఒకరి సన్నిధిలో ఒకరు ఆర్తి పుష్పాలందుకున్నారు. కాలం పంచకళ్యాణిలా పరుగులు తీసి సాయంత్రం ఇట్టే అయిపోయింది. భారంగా ఒకరి కొకరు వీడ్కోలు చెప్పుకున్నారు.

* * * * *

“ఈ రోజు మీ ఫ్రెండ్ మహదేవ్‌గారిని డిశ్చార్జి చేసేస్తాం? ఈ మందులు మాత్రం వాడమనండి. ఎందుకయినా మంచిదని మళ్ళీ ఓసారి బ్రెయిన్ స్కానింగ్ కూడా చేశాం. ఎటువంటి ప్రాబ్లమ్స్ లేనట్టే” అన్నాడు మహదేవ్‌ని ట్రీట్ చేసిన డాక్టర్.

అభిరాం మొత్తం బిల్లు చెల్లించేశాడు.

* * * * *

మహదేవ్ మనస్విని ఈ లోకంలోలేరు. స్వప్నంలో వున్నట్టు, ఏదో ట్రాన్స్‌లో వున్నట్లు పరిసరాలని మరచిపోయి అనురాగ స్వరాలు మీటుకుంటూ వున్నారు. అదే సమయంలో బయట తలుపు చప్పుడయింది. “కమిన్” అన్నాడు మహదేవ్.

అభిరాం, వరప్రసాదం లోపలికి వచ్చారు.

“అన్నీ సర్దుకున్నారా? మనం వెళ్ళిపోవాలి. ఇవాళే”అన్నాడు అభిరాం.

“గుర్తుంది. ఈ నాలుగుగోడల మధ్యలో విసిగిపోయాను. నువ్వూ, ప్రసాదంగారూ, మనస్విని లేకపోతే ..... నేనేమయిపోయేవాడ్నో .....

ఏదేమయినా హాస్పటల్‌లో మందుల వాసనల నుంచీ, బంధిఖానా జీవితం నుంచి ఇంటికెళుతున్నానంటే ఆనందంగా వుంది” అన్నాడు.

*　　*　　*　　*　　*

అభిరాం కారు సైనిక్‌పురీ కాలనీలోని మహదేవ్ ఇంటిముందు ఆగింది. కారులోంచి అభిరాం, వరప్రసాదం, మహదేవ్‌లు దిగారు. వస్తూ వస్తూ ముందు మనస్వినిని ఆమె హాస్టల్‌కి దగ్గరలో దించేశారు.

తమ వివాహం కాకుండా అతనింటికి వెళ్ళదలుచుకోలేదామె. మహదేవ్ తన గదిలోకి నడిచాడు. అతని తలకి ఇంకా బేండేజ్ అలాగే వుంది. పన్నెండు కుట్లు వరకూ పడ్డాయతని తలకి. ఆ విషయం మనస్వినికి తెలియనివ్వలేదు ఎవ్వరూ.

“బాగా చెత్తపట్టి వుంది ఇల్లు! క్లీన్ చెయ్యాలి” అన్నాడు అభిరాం.

“బహుశా నేను వూర్నించి ఇంకా రాలేదనుకుని వుంటుంది పనిపిల్ల. రేపు వస్తే శుభ్రంగా క్లీన్ చేయిస్తాలే”అన్నాడు మహదేవ్.

అప్పటిదాకా ఇలా దుమ్మూ, ధూళీతో నిండిన ఇంట్లో వుంటే తగ్గే గాయాలయినా తగ్గవు. మన పని మనమే చేసుకోవటంలో - తప్పులేదు” అని అభిరాం చీపురు వెదికి తెచ్చాడు.

“ఏమిటి ఇల్లు నువ్వు ఊడుస్తావా?” ఆశ్చర్యంగా అన్నాడు మహదేవ్.

“ఫర్వాలేదులే” అంటూ గబగబా సాలెగూళ్ళని ముందు దులిపి, తరువాత నేలంతా చీపురుతో వూడ్చేశాడు. మహదేవ్ అభిరాం వంక అభిమానంగా చూస్తుండిపోయాడు.

బీరువాలోంచి కొత్త దిండు, దుప్పటీ తీసి మహదేవ్‌కి పక్క రెడీ చేసి అతన్ని పడుకోబెట్టారు.

“మీ రుణం తీర్చుకోలేను నేను” అభిరాం, వరప్రసాదం ఇద్దరి వంకా చూస్తూ అన్నాడతను.

“అలా అంటారేమిటి మహదేవ్‌బాబూ?” అతన్ని వారిస్తూ అన్నాడు వరప్రసాదం.

అప్పుడు టైం మధ్యాహ్నం పన్నెండవుతోంది.

“ఓకే! అయితే నేను భోజనం చేసేసి, మీ ఇద్దరికీ తెచ్చేస్తాను” అంటూ బయటకు నడిచాడు అభిరాం.

అక్కడ మహదేవ్, వరప్రసాదం ఇద్దరే మిగిలారు.

*　　*　　*　　*　　*

అభిరాం కారియర్‌లో తెచ్చిన భోజనం చేశారు మహదేవ్, వరప్రసాదం. మాటల్లో పడ్డారు ముగ్గురూ.

కాలమే తెలియలేదు. చీకటి హరికేన్‌లా లోకాన్ని చుట్టుముడుతోంది. అభిరాం లేచి లైట్ స్విచ్ ఆన్‌చేశాడు. ట్యూబ్‌లైట్ కాంతిగదరంతా పరుచుకుంది.

"రాత్రి భోజనం మాటేమిటి?" అడిగాడు అభిరాం.

"ఏదో ఒకటి తినేస్తాను నేను. పాపం వరప్రసాదంగారే అస్సలెటూ కదలకుండా నా దగ్గరే ఉండిపోయారు. నాకేం ఫర్వాలేదు. మీరిద్దరూ ఇంటి కెళ్ళి రెస్ట్ తీసుకోండి" అన్నాడు మహదేవ్.

"ఒకపని చేద్దాం" ఇద్దరివంకా చూస్తూ అన్నాడు వరప్రసాదం.

"ఏమిటన్నట్టు" చూశారిద్దరూ,

"వంట పాత్రలుంటే నేనే వంట చేస్తాను. అప్పుడు అభిరాంగారికి తిరుగుడు బాధ వుండదు కదా" మహదేవ్ వైపు చూసి అన్నాడతను.

"మీరు వంట చేస్తారా?" ఇద్దరూ ఒకేసారి అన్నారు.

"ఏం చెయ్యకూడదా?" తిరిగి ప్రశ్నించాడు వరప్రసాదం.

"అలాని కాదు కానీ ..... "

"మహదేవ్‌బాబూ! స్టవ్, కొన్ని వంటపాత్రలూ వుంటే చెప్పండి"

ఇద్దరినీ కమాండ్ చేస్తున్నట్లు అన్నాడు వరప్రసాదం.

"వంటపాత్రలయితే వున్నాయి. స్టవ్‌రిపేర్ వచ్చింది. అదే ప్రాబ్లం" అన్నాడు మహదేవ్.

"అయితే ఈ రాత్రికి కూడా మీ ఇద్దరికీ కారియర్ నేనే తెచ్చేస్తాను. రేపు మాత్రం కొత్త స్టవ్ కొనుక్కుని మనం వండుకోవచ్చు" అన్నాడు అభిరాం.

'అలాగే'నన్నట్టు చూశారు మహదేవ్, వరప్రసాదం లిద్దరూ. అభిరాం వాళ్ళకి భోజనం తేవటానికి వెళ్ళాడు.

"నా వల్ల అభిరాంకి బాగా ఇబ్బందవుతుంది. అలాగే మీక్కూడా" నొచ్చుకుంటున్నట్లన్నాడు మహదేవ్.

"ఇందులో ఇబ్బందేం వుంది?" అన్నాడు వరప్రసాదం.

ఇద్దరూ మాటల్లో పడ్డారు. పావు తక్కువ తొమ్మిది అవుతుండగా అభిరాం భోజనాలతో వచ్చాడు.

వాళ్ళిద్దరూ భోజనం చేస్తున్నంత సేపూ అలా మాట్లాడుతూనే వున్నాడు.

ఇద్దరూ భోజనం చేశాక, మహదేవ్ వేసుకోవలసిన మందులు అందించాడు.

గ్లాసుతో మంచినీళ్ళు తీసుకొచ్చి వరప్రసాదం ఇచ్చాడు.

మహదేవ్ మందులు వేసుకున్నాక--

"అయితే ఏం చేద్దాం?" అడిగాడు.

"మీరు ఇంటికెళ్ళకండి. అమ్మమ్మ ఒక్కతే వుంటుంది కదా! నేను మహదేవ్ బాబుతో పాటు అతనికి పూర్తిగా నయమయ్యేదాకా ఇక్కడే వుంటాను" అన్నాడు వరప్రసాదం.

“బాగుంది. మీరన్నట్టు అలాగే చేద్దాం” అన్నాడు అభిరాం.

“పాపం! వీరినెందుకు ఇబ్బంది పెట్టటం” అన్నాడు మహదేవ్. “నేనెక్కడున్నా ఒకటే. నా గురించి ఆలోచించకండి” అన్నాడు వరప్రసాదం.

తొమ్మిదిన్నరవుతుందనగా “ఇక నేను వెళతాను. ఇంటిదగ్గర అమ్మమ్మ నాకోసం ఎదురుచూస్తుంటుంది” అన్నాడు అభిరాం.

మహదేవ్ సరేనన్నట్లు తలూపాడు.

“రేపు ఉదయం ఎనిమిదింటికల్లా వస్తాను” అంటూ బయటికి నడిచాడు అభిరాం.

“నేను కింద పడుకుంటాను” అన్నాడు వరప్రసాదం.

“అదేం? డబుల్ కాటేగా. ఇద్దరికీ సరిపోతుంది” అన్నాడు మహదేవ్.

“ఫర్వాలేదు” తనే ట్యూబ్ ఆఫ్‌చేసి, బెడ్‌ల్యాంప్ వెలిగిస్తూ అన్నాడు వరప్రసాదం.

“గుడ్‌నైట్” అన్నాడు మహదేవ్.

“గుడ్‌నైట్” బదులిచ్చాడు వరప్రసాదం.

* * * * *

హఠాత్తుగా మెలకువొచ్చింది వరప్రసాదానికి. అంత హఠాత్తుగా అతనికెప్పుడూ మెలకువ రాలేదు. తనకెందుకు మెలకువ వచ్చిందీ అతనికర్థంకాలేదు. పక్కకి చూశాడు. బెడ్‌ల్యాంప్ కాంతిలో ప్రశాంతంగా నిద్రపోతున్న మహదేవ్ కన్పించాడు.

అంతటా నిశ్శబ్దం. వాల్‌క్లాక్ చేస్తున్న ధ్వనితప్ప. ‘మరి తనకెందుకింత హఠాత్తుగా మెలకువ వచ్చిందో అర్థంకాలేదు. చప్పుడు చేయకుండా మంచినీళ్ళు తాగి మళ్ళీ పడుకున్నాడు. కానీ కంటిమీదకి కునుకురాలేదు అతనికి. కొన్ని క్షణాల తర్వాత ఏదో కదిలిన చప్పుడు. ‘ఏమిటిది?’ అనుకున్నాడతను. చెవులు రిక్కించి విన్నాడు. ఏమీలేదు.

‘తను భ్రమపడ్డాడో? లేకపోతే నిజంగానే చప్పుడయిందో అనుకున్నాడు. అతనికి ఎందుకో ఆ గదిలో ఎవరో కదలాడుతున్నట్లు అన్పించింది.

బెడ్‌ల్యాంప్ కాంతిలో కళ్ళు పెద్దవి చేసుకుని చూశాడు. ఊహు! ఎవరూ లేరు.

‘మరెందుకీరోజు తనకిలాంటి భావాలొస్తున్నాయి?’ అనుకున్నాడతను.

ఇంతలో ఎక్కడో సన్నని రోదనలాంటి ధ్వని. లేచి కూర్చున్నాడు. ఆ ధ్వని వినిపిస్తున్న దిక్కుగా నడిచాడు. హాల్లోంచి వస్తుందా ధ్వని. హాల్లోకి అడుగుపెట్టి లైట్ ఆన్ చేశాడు.

విచిత్రంగా ఆ రోదన ఆగిపోయింది. చెవులు రిక్కించి విన్నా మళ్ళీ వినిపించలేదా ధ్వని. లైటాఫ్‌చేసి వెనుదిరుగుతుండగా మళ్ళీ మొదలయింది.

ఈసారి అంతవరకూ పెరుగుతూ, మరింత పెద్దగా, అయినా పట్టించుకోలేదతను.

తిన్నగా మహదేవ్ గదిలోకి నడిచాడు.

ఆశ్చర్యం!

మంచంమీద మహదేవ్ లేడు. ‘ఎక్కడికెళ్ళాడా’ని ఆలోచించసాగాడు. అంతలో

అటాచ్‌డ్ బాత్‌రూం తలుపు తీసుకుని బయటికొచ్చాడు అతను.

"ఏమిటి నిద్రపట్టటంలేదా?" పక్కమీద కూర్చుని వున్న వరప్రసాదాన్ని అడిగాడతను.

"అవును!" ముక్తసరిగా అని చెవులు రిక్కించాడు మళ్ళీ! ఈసారి రోదన ధ్వనులాగిపోయి ఎవరో నడిచివస్తున్న అడుగుల చప్పుడు.

మెల్లమెల్లగా దగ్గరవుతూ .....

గిరుక్కున వెనుదిరిగి చూశాడు. ఏంలేదు ..... అంతా చీకటితప్ప ఈ ఇంట్లో ఏదో ఆత్మలు వున్నాయి! రూఢిగా నిర్ధారించుకున్నాడతను.

పక్కమీద వాలి కళ్ళుమూసుకున్నాడు. రాత్రంతా ఏవో చప్పుళ్ళూ, ధ్వనులు, లీలగా ఆకారంలేని నీడలు కదలాడుతున్న సంగతీ గమనించాడతను.

* * * * *

సూర్యకిరణాలు కిటికీల్లోంచి నేరుగా మహదేవ్ గదిలో ప్రసరిస్తున్నాయ్.

అప్పటికే లేచి కాలకృత్యాలు తీర్చుకుని మొత్తం ఇల్లంతా తిరిగాడు వరప్రసాదం. రెండు బెడ్‌రూమ్‌లూ, హాలూ, కిచెన్, బాత్ రూంలతో సహా. ఎక్కడా అతనికేం కన్పించలేదు.

మహదేవ్ గదిలోకి నడిచాడు. అతన్ని చూస్తూనే ఆశ్చర్యపోయాడతను. మనిషి బాగా సడలిపోయి, నీరసంగా కన్పిస్తున్నాడు.

"హాస్పటల్‌లో వున్నప్పుడే బాగున్నాడు. రాత్రి కూడా బాగున్న మనిషి తెల్లారేసరికి ఇంత మార్పా?" ఆశ్చర్యంగా అనుకున్నాడతను.

ఏడవుతుండగా నిద్రనుంచి మేల్కొన్నాడతను. వరప్రసాదాన్ని చూసి నీరసంగా నవ్వాడు.

"ఎలా వుంది?" ఆత్రంగా అడిగాడు వరప్రసాదం.

"బాగా నీరసంగా వుంది" బదులిచ్చాడు మహదేవ్.

'రాత్రి వినిపించిన విచిత్రమైన ధ్వనులకీ మహదేవ్ ఈ పరిస్థితికీ ఏదయినా సంబంధం వుందా?' మనసులో అనుకున్నాడతను.

మహదేవ్ మంచంమీదే నెమ్మదిగా లేచి కూర్చున్నాడు కొంచెంసేపు. తరువాత మంచందిగి బాత్‌రూం వైపు నడిచాడు. పావుగంట తరువాత కాలకృత్యాలు ముగించుకుని బయటపడ్డాడు.

అప్పుడే అభిరాం వచ్చాడు.

ఫ్లాస్కనిండా కాఫీ, టిఫిన్ తెచ్చాడు. మహదేవ్‌ని చూసి ఒక్కసారిగా అతని భృకుటి ముడిపడటం వరప్రసాదం గమనించాడు.